R. REPUBLIC HINDUSTAN

రిపబ్లిక్ హిందుస్థాన్

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 ఆదిలాబాద్  సంచిక : 305  ఆదివారం 6 అక్టోబర్ 2024

పేజీలు : 4

వెల : 5/-






## పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల

- రూ.20,000 కోట్ల మొత్తాన్ని విడుదల చేసిన ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ
- మధ్యవర్తల ప్రమేయం లేకుండా దేశవ్యాప్తంగా 9.4 కోట్ల మంది రైతులకు నేరుగా వారి అకౌంట్లలోనే ఈ మొత్తం జమ
- ఇక ఇప్పటి వరకు రూ.3.45 లక్షల కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది
- కిసాన్ నిధులు సమ కాని రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచన

# మూసీ నిర్వాసితులు అధైర్యపడొద్దు

- నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- మూసీ నిర్వాసితులపై సీఎం రేవంత్ కీలక ప్రకటన..
- ఎవరైనా వచ్చి రెచ్చగొడితే వారి మాటలను నమ్మొద్దు
- కాళేశ్వరంలో ఒక్క కుటుంబమే లక్ష కోట్లు మింగింది
- మూసి బాధితులు అందరిని ఆదుకోవడానికి పట్టుమని రూ. పదివేల కోట్లు కూడా కావు
- పేదల కోసం పదివేల కోట్లు ఖర్చు పెట్టడానికి ప్రభుత్వం వెనుకాడబోదు



హైదరాబాద్

మూసి నిర్వాసితులను ఆదుకునే అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వారందరినీ ఆదుకుంటుం దన్నారు. ఎవరినీ అనాదలను చేయబోమన్నారు. ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చారు సీఎం. అంతేకాదు.. ఎవరైనా వచ్చి రెచ్చగొడితే వారి మాటలను నమ్మొద్దని, వారి ఫామ్ హౌజ్‌లను కాపాడుకోవడానికే డ్రామాలాడుతున్నారని సీఎం విమర్శించారు. శనివారం నాడు కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన.. మూసీ నిర్వాసితులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. మూసీ నిర్వాసితులు - మిగతా3లో



## ఏడు పథకాలకు ఒకటే కార్డు

- పతిష్టాత్మకంగా చేపడుతున్న వన్ స్టేట్ వన్ డిజిటల్ కార్డు
- మరో రెండు రోజుల్లో ముగియనున్న పైలెట్ సర్వే
- ఓ వైపు ఈ సర్వేలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరిస్తూనే మరోవైపు కార్డు ఎలా ఉండాలనే విషయంపై అధికారులు కసరత్తు
- ఆధార్ కార్డు మాదిరిగానే ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఉంటుందని సమాచారం

హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన్ స్టేట్ వన్ డిజిటల్ కార్డు పైలెట్ సర్వే మరో రెండు రోజుల్లో ముగియనుంది. ఓ వైపు ఈ సర్వేలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరిస్తూనే మరోవైపు కార్డు ఎలా ఉండాలనే విషయంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇది కూడా ఓ కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. ఆధార్ కార్డు మాదిరిగానే ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఉంటుందని అంటున్నారు. తెలంగాణలో తీసుకొస్తున్న ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డులో కుటుంబానికి చెందిన - మిగతా3లో



## నాలుగు కార్పొరేషన్లుగా హైదరాబాద్

- ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్నజనాభా మొత్తాన్ని పరగిణనలోకి తీసుకుంటే.. కోటిన్నర వరకూ ఉంటారు
- ఇప్పటికే గ్రామాలుగా ఉన్న వాటిని సమీప మున్సిపాలిటీల్లో విలీనం
- ప్రభుత్వం ఇప్పుడు ఔటర్ మొత్తాన్ని గ్రేటర్ పరిదిలోకి తేవాలని ప్రాథమికంగా నిర్ణయం
- ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో 30 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వీటన్నింటినీ కలిపి, హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్‌గా చేయాలని ప్రభుత్వం మొదట ప్రణాళికలు సిద్ధం

## ప్రాణాలు తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు..
- సులభంగా డబ్బులు సంపాదించొచ్చనే ఆశతో ఎంతోమంది బెట్టింగులు ఆడుతున్నారు.
- అప్పుల ఊబిలో కూరుకుపోయి కుటుంబాలను రోడ్డు మీదకు తెస్తున్నారు




నిజామాబాద్

ఆన్‌లైన్ బెట్టింగ్ ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపు తోంది. సులభంగా డబ్బులు సంపాదించొచ్చనే ఆశతో ఎంతోమంది బెట్టింగులు ఆడుతున్నారు. ఆ క్రమంలో దానికి బానిసలుగా మారి అప్పుల పాలవుతున్నారు. వాటిని ఎలా తీర్చాలో అర్థం కాక - మిగతా3లో

## కలుషిత నీరు తాగి 500 మందికి పైగా అస్వస్థత



- సెప్టెంబర్ 30న రెండు వార్డులకు సరఫరా అయిన నీటిలో వ్యాధికారిక 'సాల్మోనెల్లా బాసిలరీ' లక్షణాలు
- ప్రత్యేక వైద్య బృందాన్ని పంపడంతో 56 కేసుల్లో ఈ బ్యాక్టీరియా కనుగొనట్లు వెల్లడి
- తగిన మందులు ఇవ్వడంతో బాధితులు కోలుకున్నారు
- నీరు కలుషితం కావడానికి వాటర్ ట్యాంకు మెయింటెన్స్ సరిగా లేకపోడమే కారణమని స్థానికులు ఆరోపణ
- కర్ణాటకలోని ఉడిపి జిల్లా ఉప్పుండలో ఘటన



## మూసీ గబ్బంతా ముఖ్యమంత్రి, మంత్రుల నోట్లోనే ఉంది


- రేవంత్ ప్రభుత్వం ఈ పది నెలల్లో కొత్తగా సాధించింది ఏం లేదు..
- మూసీ సుందరీకరణ కోసం లక్షా 50 వేల కోట్లు ఖర్చు పెడుతా అంటుండు
- రైతుబంధు, ఆసరా పెన్షన్లు, రుణమాఫీకి పైసల్లేవట.
- రైతుబంధు, పెన్షన్లు, తులం బంగారం ఇస్తే మీరు కమిషన్ ఇవ్వరు
- కానీ అదే మూసీలో 30 వేల కోట్లు దొబ్బి ఢిల్లీకి మూటలు పంపాలి
- అందుకు మూసీ పథకం పెట్టిండు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రంగారెడ్డి

మూసీ గబ్బంతా ముఖ్యమంత్రి, మంత్రుల నోట్లోనే ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిలా పని చేయడం లేదు.. రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని కందుకూరులో ఏర్పాటు చేసిన రైతు ధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. రేవంత్ ప్రభుత్వం ఈ పది నెలల్లో కొత్తగా సాధించింది ఏం లేదు.. - మిగతా3లో

# హైడ్రా ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

- గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- ఇకపై హైడ్రా చేపట్టబోయే అన్ని కార్యకలాపాలకు చట్టబద్ధత
- అధికారి లేదా ఏజెన్సీకి అప్పగించే అధికారం ప్రభుత్వానికి కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ
- అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను రంగంలోకి దింపింది జులై 19న జీవో 99 ద్వారా హైడ్రాను ఏర్పాటు
- జీహెచ్ఎంసీ చట్టం 1955లో 374 బీ సెక్షన్ చేరుస్తూ ఆర్డినెన్స్ జారీ



హైదరాబాద్

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కు అధికారికంగా హైపవర్స్ వచ్చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన హైడ్రా ఆర్డినెన్స్‌కు గర్నవర్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేసింది. హైడ్రా ఆర్డినెన్స్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు. హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్‌పై సంతకం చేసిన గవర్నర్ శనివారం గెజిట్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని చెరువులు, నాలాలపై అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను రంగంలోకి దింపింది. జులై 19న జీవో - మిగతా3లో



## చేసిందంతా చేసి ఇప్పుడు తలవంచుకుంటే ఏం లాభం?

- మోదీపై రాహుల్ విసుర్లు
- శివాజీ సందేశం దేశప్రజలందరికీ వర్తిస్తుంది
- ఛత్రపతి శివాజీ మహారాజు, షాహు మహారాజ్ వంటి వీర యోధులు లేకుంటే అసలు రాజ్యాంగమే ఉండేది కాదు
- అలాంటి రాజ్యాంగాన్ని, కీలక సంస్థలను బీజేపీ ప్రభుత్వం నీరు గారుస్తోంది
- ఆయా సంస్థలను నాశనం చేస్తూ ఇప్పుడు ఛత్రపతి శివాజీ ఎదుట తలవంచి నమస్కరించడం వల్ల ఎలాంటి ప్రయోజం ఉండదు

# పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల



**న్యూఢిల్లీ:** అన్నదాతలకు వ్యవసాయ పెట్టుబడి సాయం అందించే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 18వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.20,000 కోట్ల మొత్తాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారంనాడు విడుదల చేశారు. మహారాష్ట్రలోని వాశింలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని స్వయంగా పాల్గొని ఈ నిధులను విడుదల చేశారు. మధ్యవర్తల ప్రమేయం లేకుండా దేశవ్యాప్తంగా 9.4 కోట్ల మంది రైతులకు నేరుగా వారి అకౌంట్లలోనే ఈ మొత్తం జమ అవుతుంది. పీఎం కిసాన్ నిధుల విడుదలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానితో పాటు మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్, మంత్రి సంజయ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా 732 కృషి విజ్ఞాన్ కేంద్రాలు, లక్ష ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘాలు, 5 లక్షల కామన్ సర్వీస్ సెంటర్లతో సహా 2.5 కోట్ల మంత్రి రైతులు హాజరయ్యారు. భూములున్న రైతులకు మూడు వాయిదాల్లో ఏటా రూ.6,000 ఇచ్చే పీఎం-కిసాన్ పథకాన్ని 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించారు. శనివారంనాడు 18వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద ప్రధాని విడుదల చేసిన మొత్తంతో కలిసి ఇంతవరకూ రూ.3.45 లక్షల కోట్లకు పైగా పంపిణీ జరిగింది. మహారాష్ట్రలో 17 ఇన్‌స్టాల్‌మెంట్స్‌లవో 1.20 కోట్ల రైతులకు రూ.32,000 కోట్లు జమ అయ్యాయి. 18వ ఇన్‌స్టాల్‌మెంట్‌గా 91.51 లక్షల రైతులు రూ.1,900 కోట్లకు పైగా ప్రయోజనం పొందనున్నారు. పీఎం కిసాన్ ఇన్‌స్టాల్‌మెంట్ పంపిణీతో పాటు రూ.2,000 కోట్లను నమో సేత్కారి మహాసన్మాన్ నిధి యోజన 5 ఇన్‌స్టాల్‌మెంట్ కింద మహారాష్ట్రకు ప్రధామంత్రి విడుదల చేశారు.

**ఢోలు వాయించిన ప్రధాని మోదీ..**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇవాళ మహారాష్ట్రలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న జగదాంబ మాతా ఆలయాన్ని ప్రధాని సందర్శించారు.

మూలవిరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత సంత్ సేవా లాల్ జీ మహరాజ్ సమాధి అయిన చోటును సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సంప్రదాయ ఢోలును వాయించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. కాగా, దేశవ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. దీంతో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

## ఫైవ్ స్టార్ హోటల్ సౌకర్యాలతో

# వందే భారత్ స్లీపర్లు

**చెన్నై :** దేశంలో వందే భారత్ రైళ్లు దూసుకుపోతున్నాయి. ఇవి ప్రారంభించినప్పటి నుంచే అనూహ్య స్పందన వస్తున్నాయి. వీటిల్లో ప్రయాణం చేయడానికి చాలా మంద ఆసక్తి చూపుతున్నారు. ముందుగా ప్రధాన రూట్లలో ప్రారంభించిన వందే భారత్ ఎక్స్ ప్రెస్ లు ఇప్పుడు తక్కువ దూరంలో కూడా వెళ్తుననాయి. అయితే రైల్వే శాఖ తాజాగా మరో నిర్ణయం తీసుకుంంది. వందే భారత్ నుంచి స్లీపర్ రైళ్లను కూడా నడపాలని నిర్ణయం తీసుకున్నాయి. ఇందు కోసం ఇప్పటికే అన్ని విధాలుగా ఏర్పాట్లు చేశారు. అయితే ముందుగా ట్రయల్ రన్ నిర్వహించిన తరువాత వీటిని మెయిన్ ట్రాక్ లోకి తీసుకొస్తారు. అప్పుడే ఇవి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. అయితే వంద్ భారత్ స్లీపర్ రైళ్లు ఎలా ఉండబోతున్నాయి.ప్రస్తుతం వందే భారత్ ఎక్స్ ప్రెస్ లు పట్టాలపై ప్రయాణం చేస్తున్నాయి. త్వరలో స్లీపర్ రైళ్లు కూడా ఉండనున్నాయి. అయితే వీటిల్లో అదనంగా కొన్ని ప్రత్యేక సదుపాయాలు ప్రవేశపెట్టినట్లు రైల్వే శాఖ నుంచి సమాచారం ఉంది. ఇందులో ప్రయాణికులకు సౌకర్య వంతంగా యూఎస్ బీ ఛార్జర్ ఉండనుంది. వీరి రక్షణ కోసం సీసీ కెమెరాలు, విమానంలో లాగా ఇన్ సైడ్ డిస్ ప్లే, సమాచారం తెలిపే విజువల్ బోర్డులు ఉండనున్నాయి. ఏసీ కోచ్ లో వేడి నీరుకూడా ఉండనుంది. దివ్యాంగుల కోసం ప్రత్యేక బెర్త్ లు అమరుస్తున్నారు.ఇప్పుడున్న వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లు గంటకు 160 కిలోమీటర్ల దూరంలో ప్రయాణిస్తున్నాయి. అయితే కొత్తగా రాబోతున్న వందే భారత్ స్లీపర్ రైళ్లు గంటకు 180 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నాయి. కొత్త రైళ్ల టికెట్ ధరలు ఎలా ఉంటాయి? అనేది ఆసక్తిగా ఉంది. కానీ రైల్వే సమాచారం మేరకు ఇప్పుడున్న ఎక్స్ ప్రెస్ ధరలకు సమానంగానే స్లీపర్ ధరలు కూడా ఉంటాయని తెలుస్తోంది. అయితే ఇవి పూర్తిగా అందుబాటులోకి వచ్చిన తరువాత ప్రకటించే అవకాశం ఉంది.ఇందులో మొత్తం 16 కోచ్ లు ఉంటాయి. వీటిలో 1 ఫస్ట్ క్లాస్, 2ఏసీ కోచ్ లు 4, 3ఏసీ కోచ్ లో 11 ఉండనున్నాయి.తాజాగీ ఈ రైలు రైల్వే ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీకి చేరుకోనుంది. మరికొద్దిరోజుల్లో దీనిని ట్రయల్ రన్ నిర్వహిస్తారు. ఆ తరువాత డిసెంబర్ లో ఇది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. కొత్తగా ప్రారంభించే వందే భారత్ స్లీపర్ రైలు బెంగుళూరు, ఢిల్లీ, ముంబయ్ రూట్లలో ప్రారంభించే అవకాశం ఉంది. వందే భారత్ ఎక్స్ ప్రెస్ కు అనుగుణంగా వీటి సమయాలు మార్చనున్నారు. అయితే కొత్త రైలుకు అనుగుణంగా ఫైలట్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే లోకో ఫైలెట్ క్యాబ్ ఆధునీకంగా ఉండనుంది. మరోవైపు ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఇందులో అదనపు సౌకర్యాలు అమర్చనున్నారు. దూర ప్రయాణాలు చేసేవారికి స్లీపర్ రైలు సౌకర్యవంతంగా ఉంటుందని భావిస్తున్నారు.



# ఒక్కటైన టాలీవుడ్...

**హైదరాబాద్ :** తెలంగాణలో మంత్రి సురేఖ చేసిన కామెంట్స్ దుమారం రేపుతున్నాయి. కేటీఆర్ పై విమర్శలు చేసే క్రమంలో అక్కినేని కుటుంబం పై ఆమె అనుచిత వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా సమంత, నాగచైతన్య మధ్య విడాకులకు కేటీఆర్ కారణమని ఆరోపిస్తూ చేసిన కామెంట్స్ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. సినీ పరిశ్రమ వ్యక్తుల మనోభావాలు దెబ్బ తినేలా ఈ వ్యాఖ్యలు ఉన్నాయంటూ ఎక్కువ మంది ఖండిస్తున్నారు. అన్ని వర్గాల ప్రముఖులు, సాధారణ ప్రజలు సైతం సురేఖ చేసిన వ్యాఖ్యలను సమర్థించడం లేదు. అన్ని వర్గాల వారు అక్కినేని కుటుంబానికి అండగా నిలబడుతున్నారు. టాలీవుడ్ అంతా ఏకతాటిపైకి వచ్చి కొండా సురేఖకు వ్యతిరేకంగా మీడియా సమావేశం పెట్టే ప్రయత్నం చేశారు. అయితే ఆ వ్యాఖ్యలను సురేఖ వెనక్కి తీసుకోవడంతో మీడియా సమావేశాన్ని వాయిదా వేసుకున్నారు. కానీ సోషల్ మీడియా వేదికగా మాత్రం సురేఖ తీరుపై నిప్పులు చెరిగారు. వారు వీరు అనే తేడా లేకుండా టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు నాగార్జున కుటుంబానికి సన్నిహితంగా ఉన్నట్లు, ఇతర ఆర్టిస్టులు ఖండించారు. మంత్రి కొండా సురేఖ తీరుపై తీవ్రంగా తప్పుపట్టారు. అయితే ఇది చాలా మంచి పరిణామం. చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఈ తరహాలో తిప్పి కొట్టడం అనేది ఆహ్వానించదగ్గదే. అయితే గత ఐదేళ్ల వైసిపి పాలనలో మెగాస్టార్ చిరంజీవి కుటుంబం పై చాలాసార్లు అనుచిత వ్యాఖ్యలు చేశారు తోటి సినీ వ్యక్తులు. ఒకరిద్దరు వైసీపీ నేతలు సైతం అప్పట్లో విరుచుకుపడిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఆ సమయంలో ఒక్కరంటే ఒక్కరు కూడా స్పందించిన దాఖలాలు లేవు. ఇప్పుడు ఇదే హాట్ టాపిక్ అవుతోందివైసీపీ హయాంలో కొందరి నేతల తీరు అభ్యంతరకరంగా ఉండేది. శాసనసభలో ఏకంగా చంద్రబాబు భార్య భువనేశ్వరి పై అనుచిత వ్యాఖ్యలు చేశారు వైసీపీ ప్రజాప్రతినిధులు. ఆమె నందమూరి తారకరామారావు కుమార్తె. ఎన్టీఆర్ అంటేనే తెలుగు చిత్ర పరిశ్రమ.. తెలుగు చిత్ర పరిశ్రమ అంటేనే ఎన్టీఆర్. ఇలా పెనవేసుకుపోయింది వారి బంధం. అటువంటి ఎన్టీఆర్ కుమార్తెకు ఘోర అవమానం జరిగితే ఒక్కరంటే ఒక్కరు.. తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తులు స్పందించలేదు. నందమూరి కుటుంబం బాధపడినా ఓదార్చేందుకు ముందుకు రాని పరిస్థితి అప్పట్లో ఉండేది. పైగా తెలుగు చిత్ర పరిశ్రమకు ఎన్టీఆర్ తో పాటు చంద్రబాబు కూడా చేయూతనందించారు. కనీసం ఆ విషయాన్ని గుర్తించి కూడా ఎవరు స్పందించలేదు. కనీసం మాట్లాడలేదు.ఐదేళ్లుగా పవన్ వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకోని వైసిపి నేతలేరు. ప్రారంభంలో చిరంజీవి అంటే అభిమానం ప్రదర్శించిన వారు సైతం.. ఎన్నికలకు ముందు అనుచిత వ్యాఖ్యలు చేశారు. పకోడీ గాళ్లు అంటూ ఎగతాళిగా మాట్లాడారు. మరికొందరైతే అంజనాదేవి పేరును ప్రస్తావిస్తూ కూడా తిట్ల దండకం అందుకున్నారు. కానీ ఆ సమయంలో ఒక్కరంటే ఒక్కరు కూడా సినీ పరిశ్రమ నుంచి అభ్యంతరం వ్యక్తం చేయలేదు. మీరు చేస్తున్నది తప్పు అని చెప్పలేదు. కేవలం అప్పట్లో ప్రేక్షకపాత్ర మాత్రమే పోషించారు. పవన్ పై పోసాని కృష్ణ మురళి ఏకంగా తిట్ల దండకమే అందుకున్నారు. అప్పుడు ఆయన తెలుగు చలనచిత్ర అభివృద్ధి మండలి అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. అయినా సరే సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు ఒక్కరు కూడా స్పందించలేదు.ఇప్పుడు నాగార్జున కుటుంబం పై సానుభూతి చూపిస్తున్నారు. దీనిని తప్పు పట్టలేము కానీ.. ఇదే మనుషులు అప్పుడు ఎక్కడికి వెళ్లారు అన్నది ఇప్పుడు ప్రశ్న. అప్పట్లో తెలంగాణలో కెసిఆర్ అధికారంలో ఉండేవారు. ఏపీలో సీఎం గా జగన్ ఉండేవారు. చిత్ర పరిశ్రమ అంతా హైదరాబాదులో ఉండేది. కెసిఆర్ తో జగన్ స్నేహం కొనసాగించేవారు. అందుకే అప్పట్లో వైసీపీ నేతల తీరుపై చిత్ర పరిశ్రమ వ్యతిరేకించేది కాదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అందుకే చిత్ర పరిశ్రమ వ్యక్తులు స్వేచ్ఛగా స్పందిస్తున్నారు.



## చేసిందంతా చేసి ఇప్పుడు తలవంచుకుంటే ఏం లాభం?



**ముంబై:** ప్రజాస్వామ్యాన్ని, దేశంలోని వ్యవస్థలను బీజేపీ ప్రభుత్వం నీరుగారుస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆక్షేపించారు. ప్రజలను భయపెడుతూ, రాజ్యాంగాన్ని, ఆయా సంస్థలను నాశనం చేస్తూ ఇప్పుడు ఛత్రపతి శివాజీ ఎదుట తలవంచి నమస్కరించడం వల్ల ఎలాంటి ప్రయోజం ఉండదని అన్నారు. కొల్హాపూర్‌లో శనివారంనాడు జరిగిన ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రాహుల్ పాల్గొన్నారు. ఇటీవల సింధుదుర్గ్ జిల్లా రాజ్‌కోట ఫోర్ట్‌లోని 35 అడుగుల శివాజీ విగ్రహం కుప్పకూలిన ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ రాహుల్ తాజా వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ 2023 డిసెంబర్ 4న రాజ్‌కోట ఫోర్ట్‌లోని శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అయితే, భారీ వర్షాలతో గత ఆగస్టు 6న ఆ విగ్రహం కూలిపోవడం రాజకీయ దుమారానికి దారితీసింది. ఆ ఘటన అనంతరం గత ఆగస్టులోనే మహారాష్ట్రలో పర్యటించిన సందర్భంగా శివాజీ విగ్రహం ఘటనపై ప్రధాని క్షమాపణలు చెప్పుకున్నారు. ఛత్రపతి శివాజీ అంటే ఒక పేరో, రాజో కాదని, తమకు దైవమని అన్నారు. ఈరోజు ఆయనకు తలవంచి క్షమాపణలు చెప్పుకుంటున్నానని అన్నారు.

**ఛత్రపతి వంటి వీరులు లేకుంటే...**

కాగా, కొల్హాపూర్‌లో శివాజీ విగ్రహావిష్కరణకు వచ్చిన రాహుల్ గాంధీ పరోక్షంగా ఇటీవల కూలిన శివాజీ విగ్రహాన్ని ప్రస్తావిస్తూ, శివాజీ సందేశం దేశప్రజలందరికీ వర్తిస్తుందన్నారు. ఛత్రపతి శివాజీ మహరాజు, షాహు మహారాజ్ వంటి వీర యోధులు లేకుంటే అసలు రాజ్యాంగమే ఉండేది కాదని అన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని, కీలక సంస్థలను బీజేపీ ప్రభుత్వం నీరు గారుస్తోందని ఆరోపించారు.

## కలుషిత నీరు తాగి 500 మందికి పైగా అస్వస్థత



**ఉడిపి:** కర్ణాటకలోని ఉడిపి జిల్లా ఉప్పుండలో స్థానిక ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి సరఫరా చేసిన నీరు కలుషితమై 500 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. బైందూర్ జిల్లా ఉప్పండ గ్రామ పంచాయతీలోని కర్కి కల్లి, మడకల్ వార్డులకు ఈ నీరు సరఫరా అయిందని, నీరు తాగి వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించడంతో తక్షణ వైద్య చర్యలతో చాలా మంది కోలుకున్నారని అధికారులు తెలిపారు. జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఐపీ గదాద్ మరిన్ని వివరాలు తెలియజేస్తూ, సెప్టెంబర్ 30న రెండు వార్డులకు సరఫరా అయిన నీటిలో వ్యాధికారిక 'సాల్మోనెల్లా బాసిలరీ' లక్షణాలు కనిపించాయని అన్నారు. ప్రత్యేక వైద్య బృందాన్ని పంపడంతో 56 కేసుల్లో ఈ బ్యాక్టీరియా కనుగొనట్టు తెలిపారు. తగిన మందులు ఇవ్వడంతో బాధితులు కోలుకున్నారని, ఏ ఒక్కరి పరిస్థితి ప్రమాదకరంగా లేదని చెప్పారు. ఇవాల్టి వరకూ 150 కేసులు కనుగొన్నట్టు చెప్పారు. కాగా, ఈ ఘటనకు ముందు మూడు రోజులు, ఆ తర్వాత కూడా నీటి సరఫరా జరగలేదని, మురికి జలాలు సరఫరా కావడంతో నీటిని మరగబెట్టి, ఫిల్టర్ చేసుకుని తాగిన వారిలో ఎలాంటి బ్యాక్టీరియా లక్షణాలు కనిపించ లేదని రెండు వార్డులకు చెందిన గ్రామపంచాయితీ సభ్యులు తెలిపారు. మరోవైపు, నీరు కలుషితం కావడానికి వాటర్ ట్యాంకు మెయింటెన్స్ సరిగా లేకపోడమే కారణమని స్థానికులు ఆరోపించారు. ఘటనపై విచారణ జరిపి, తక్షణం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనికి ముందు గత ఆగస్టులో మాండ్య జిల్లా కేఆర్ పేట్ తాలూకాలో కలుషిత నీరు తాగి ఇద్దరు మృతి చెందగా, 12 మంది అస్వస్థతకు గురయ్యారు.

## ఎస్‌సీఓ సభ్యుడిగా మాత్రమే పాక్ వెళ్తున్నా, చర్చలకు కాదు

న్యూఢిల్లీ: ఈనెల 15,16 తేదీల్లో షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశం కోసం పాకిస్థాన్ వెళ్తున్న ఢిల్లీ విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ తన పర్యటనలో దాయాది దేశంతో ఎలాంటి ద్వైపాక్షిక చర్చలు ఉండవని తెలిపారు. ఢిల్లీలో ఒక కార్యక్రమానికి వచ్చిన జైశంకర్ మీడియాతో మాట్లాడుతూ, బహుళపక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు తాను వెళ్తున్నానని, భారత్-పాక్ సంబంధాల గురించి మాట్లాడేందుకు కాదని చెప్పారు. ఎస్‌సీఓలో సభ్యుడిగానే తాను అక్కడకు వెళ్తున్నానని, తనొక మర్యాద కలిగిన పౌరుడనని, అందుకు అనుగుణంగానే వ్యవహరిస్తారని తెలిపారు. సౌత్ ఏసియన్ అసోసియేషన్ ఆఫ్ రీజనల్ కో-ఆపరేషన్ కార్యక్రమాలు నిలిచిపోవడంపై పాక్‌ను జైశంకర్ పరోక్షంగా తప్పుపట్టారు. ప్రస్తుతానికైతే సార్క్ కార్యక్రమాలు ముందుకు వెళ్లడం లేదని, సార్క్‌లోని ఒక సభ్యదేశం ఆ గ్రూపునకే చెందిన మరో దేశంపై ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతోందని పాక్‌ను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. ఆ కారణం వల్లే ఇటీవల కాలంలో సార్క్ సమావేశాలు జరగడంలేదన్నారు. అయితే ప్రాంతీయ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయినట్టు కాదన్నారు. నిజానికి గత ఐదేరేళ్లుగా భారత ఉపఖండంలో ప్రాంతీయ సమైక్యత పెరిగిందని చెప్పారు. కాగా, గత తొమ్మిదేళ్లలో భారత విదేశాంగ మంత్రి పాకిస్థాన్ వెళ్తుండటం ఇదే మొదటిసారి. ఎస్‌సీఓ కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆప్ గవర్నమెంట్ సమావేశానికి ఈసారి పాక్ ఆతిథ్యం ఇస్తోంది.

## నాగార్జునపై క్రిమినల్ కేసు

**హైదరాబాద్ :** ఎన్ కన్వెన్షన్ యజమాని , నటుడు నాగార్జునకు వరుసగా కష్టాలు వస్తున్నాయి. మంత్రి కొండా సురేఖ కేటీఆర్ ఇష్యూలో తమ కుటుంబాన్ని ప్రస్తావించి విమర్శలు చేశారని ఆమెపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్న దశలో నాగార్జునపై క్రిమినల్ కేసు నమోదు అయింది. చెరువును కబ్జా చేశారని జనం కోసం అనే స్వచ్ఛంద సంస్థకు చెందిన కసిరెడ్డి భాస్కర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైటెక్ సిటీ ప్రాంతంలోని తమ్మిడికుంటను కబ్జా చేసి ఎన్-కన్వెన్షన్ నిర్మించి లాభాలు ఆర్జించారని భాస్కర్ రెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువును నాగార్జున కబ్జా చేసినట్లు ఇరిగేషన్ అధికారులు ధృవీకరించిన ఆధారాలు కూడా తన ఫిర్యాదుకు జత చేసినట్లుగా తెలుస్తోంది. తమ్మిడికుంట ఎఫ్టీఎల్ బఫర్ జోన్ స్థలంలో 3 ఎకరాల 30 గుంటల భూమిని ఆక్రమించి ఎన్-కన్వెన్షన్ నిర్మించినట్లు ఇరిగేషన్ శాఖ నార్త్ ట్యాంక్స్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఫిబ్రవరి 17, 2021న నివేదిక ఇచ్చారని.. వంద కోట్ల విలువైన చెరువు స్థలాన్ని కబ్జా చేసి రెవెన్యూ, ఇరిగేషన్ చట్టాలను ఉల్లంఘించి పర్యావరణాన్ని విధ్వంసం చేశారని ఫిర్యాదులో భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. వెంటనే క్రిమినల్ చర్యలు నమోదు చేయాలని కోరారు. న్యాయసలహా తీసుకున్న పోలీసులు కేసు నమోదుచేశారు. ఎన్ కన్వెన్షన్ ను హైడ్రా అధికారులు ఇటీవలే కూల్చివేశారు. అలా కూల్చివేయడానికి హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసిన వారిలో జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి కూడా ఉన్నారు. ఇప్పుడు ఆయనే పోలీసులకూ ఫిర్యాదు చేశారు. నాగార్జున చాలా కాలం క్రితం మరో పార్టనర్‌తో కలిసి నిర్మించిన ఎన్ కన్వెన్షన్ చెరువులోనే ఉందని చాలా కాలం నుంచి ఆరోపణలు ఉన్నాయి.

# మూసీ నిర్వాసితులు అధైర్యపడొద్దు


-మొదటిపేజీ తరువాయి

అధైర్యపడొద్దని.. ప్రత్యామ్నాయం చూపిస్తామన్నారు. మూసీ బాధితులకు అండగా ఉన్నట్లు మాట్లాడే వారంతా పేదలకు ఏం చేద్దామో.. వారిని ఎలా ఆదుకుందామో చెప్పాలని కోరారు. ఇళ్లు ఇద్దామా.. డబ్బులు ఇద్దామా.. ప్రభుత్వ స్థలాలు ఇద్దామా.. అని విపక్ష నేతలను సీఎం ప్రశ్నించారు.

హైదరాబాద్ నగరాన్ని నీటి ప్రమాదం నుంచి కాపాడాలని.. ప్రజల మంచి కోసమే ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు సీఎం రేవంత్. మూసీ దగ్గర ఉన్న వాళ్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాళేశ్వరంలో ఒక్క కుటుంబమే లక్ష కోట్లు మింగిందంటూ కేసీఆర్ కుటుంబం టార్గెట్‌గా తీవ్ర ఆరోపణలు చేశారు సీఎం రేవంత్. మూసి బాధితులు అందరిని ఆదుకోవడానికి పట్టుమని రూ. పదివేల కోట్లు కూడా కావన్నారు. పేదల కోసం పదివేల కోట్లు ఖర్చు పెట్టడానికి ప్రభుత్వం వెనుకాడబోదన్నారు.

ఈటెల రాజేందర్, కేటీఆర్, హరీష్ రావు సచివాలయానికి రావాలని.. ప్రజలకు ఏం చేద్దామో చర్చిద్దామని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. మూసీ విషంతో బతుకుతున్న నల్లగొండను ఎలా ఆదుకోవాలో చర్చిద్దామన్నారు. ఇలాగే వదిలేసి మూసీని మూసేద్దామా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ సబర్మతి రివర్ ఫ్రంట్ కోసం 64 వేల కుటుంబాలను తరలించారని.. కేవలం 16వేల కుటుంబాలకే పరిహారం ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాంటిదే హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ చేస్తే ఈటెల రాజేందర్‌కు వచ్చిన ఇబ్బంది ఏంటి? అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ పార్టీ అకౌంట్‌లో రూ. 1,500 కోట్లు ఉన్నాయని.. అందులోంచి మూసీ బాధితులకు రూ. 500 కోట్లు ఇవ్వాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. ఈ డబ్బులను మూసీ



నిర్వాసితులకు పంచిపెడదామన్నారు. గజ్వేల్‌లో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాలు ఉందని.. అందులోకి 500 ఎకరాలు దానం చేస్తే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తానని సీఎం అన్నారు. కేటీఆర్‌కు జన్వాడలో 50 ఎకరాల ఫామ్ హౌజ్ ఉందని.. అందులో 25 ఎకరాలు ఇవ్వాలన్నారు. 'ఇవన్నీ దోచుకున్నవే కదా? మీ తాతల నుంచి వచ్చినవి కాదు కదా? 2009 నుంచి మీ ఆస్తులు ఎలా పెరుగుతూ వచ్చాయి.' అని కేటీఆర్‌ను సీఎం రేవంత్ ప్రశ్నించారు. రేస్ కోర్సు బయటకు తరలిద్దామని.. అంబర్‌పేటలో ఉన్న పోలీస్ అకాడమీని బయటకు తరలిద్దామన్న సీఎం.. అందులో పేదలకు ఇళ్లు కట్టిద్దామని చెప్పారు. పేదలకు న్యాయం చేయడానికి ఒక కమిటీని వేస్తామని.. అందులో ఈటెల రాజేందర్, కేటీఆర్, హరీష్ రావు, పొన్నం ప్రభాకర్‌ను సభ్యులుగా నియమిస్తామన్నారు. పేదల బాధ తనకు తెలుసునని.. ఏ పని చేసినా అడ్డుపడొద్దని రేవంత్ విజ్ఞప్తి చేశారు.

### కేటీఆర్ దీక్షపై సీఎం రేవంత్ రియాక్షన్..

కేటీఆర్ దీక్షపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. రెండు లక్షల వరకు ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేశామని సీఎం పునరుద్ఘాటించారు. రెండు లక్షలపైన రుణం ఉన్న వారికి.. పైన డబ్బులు కడితే మిగతావి ఇస్తామని చెప్పామన్నారు. రుణమాఫీ జరగలేదని కేటీఆర్ దీక్ష చేపట్టారని విమర్శించారు. రెండు లక్షల పైనున్న వాళ్లకు మాత్రమే రుణమాఫీ జరగలేదని సీఎం వివరించారు. రైతులు ఎవరూ వీరిని నమ్మొద్దని హితవు చెప్పారు రేవంత్. ఏమైనా సమస్యలుంటే కలెక్టర్‌ను కలిసి అడగాలని.. సమస్యను పరిష్కరిస్తారన్నారు. సోషల్ మీడియాతో అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ నాయకులు కలలు కంటున్నారని.. చిల్లర పనులు చేస్తే చర్లపల్లి జైలుకు వెళతారని చురకలంటించారు సీఎం.

### వివేక్‌కు మంత్రి పదవి..?

ఇదే సమయంలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు మంత్రి పదవిపై సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో వెంకట స్వామి కుటుంబం పాత్ర ఖచ్చితంగా ఉంటుందన్నారు. అంతేకాదు.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ మరుగున పడొద్దని కాకా ఆలోచించారన్నారు. సోనియాగాంధీ, ప్రణబ్ ముఖర్జీని ఒప్పించి టీఆర్ఎస్‌తో పొత్తు కుదిర్చారన్నారు. టీఆర్ఎస్‌కు 42 ఎమ్మెల్యే, 5 ఎంపీ సీట్లు ఇప్పించడానికి ప్రధాన కారణం కాకా నే అని అన్నారు. కాకా వల్లనే ఆనాడు బీఆర్ఎస్(టీఆర్ఎస్) బలపడిందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత అసూయతో కాకాను వదిలేశారని సీఎం విమర్శించారు. మల్లిఖార్జున ఖర్గే సూచనతో వివేక్ వెంకటస్వామిని తిరిగి కాంగ్రెస్‌లోకి తీసుకువచ్చానని రేవంత్ రెడ్డి చెప్పారు. వెంకటస్వామి సూచన మేరకే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టారని.. తుమ్మిడి హట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును నిర్మిస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మన కళ్లముందే కట్టడం, కూలిపోవడం కూడా జరిగిందని సీఎం విమర్శించారు.

# మూసీ గబ్బంతా ముఖ్యమంత్రి, మంత్రుల నోట్లోనే ఉంది..

-మొదటిపేజీ తరువాయి

కానీ రెండు జరుగుతున్నాయి. మూసీ సుందరీకరణ కోసం లక్షా 50 వేల కోట్లు ఖర్చు పెడుతా అంటుండు. రైతుబంధు, ఆసరా పెన్షన్లు, రుణమాఫీకి పైసల్లేవట. కానీ లక్షా 50 వేల కోట్లు మూసీలో పోస్తాడట. ఎందుకో తెలుసా..? రైతుబంధు, పెన్షన్లు, తులం బంగారం ఇస్తే మీరు కమిషన్ ఇవ్వరు. కానీ అదే మూసీలో 30 వేల కోట్లు దొబ్బి ఢిల్లీకి మూటలు పంపాలి. అందుకు మూసీ పథకం పెట్టిండు. కేసీఆర్ కాళేశ్వరం కట్టిండు, పాలమూరు 90 శాతం కట్టిండు. నీళ్లు ఇచ్చేందుకు కట్టిండు. మరి మూసీతో ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇస్తావు? సమాధానం ఉందా..? అంటే లేదు. కమిషన్లు దొబ్బేందుకు ప్లాన్ చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. ఆయనకు కమిషన్ల పిచ్చి పట్టింది. పేదవాళ్లకు సంక్షేమ పథకాలు అమలు చేస్తే పైసలు రావు.. కాబట్టి మూసీ పేరు మీద బ్యూటిఫికేషన్ కాకుండా లూటిఫికేషన్ చేస్తే కాంగ్రెసోళ్లకు డబ్బులు పంపి.. కుర్చీని కాపాడుకునేందుకు రేవంత్ రెడ్డి యత్నిస్తున్నాడని కేటీఆర్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో 14 వేల ఎకరాలు ఫార్మా సిటీకి సేకరించాం. ఇదే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, భట్టి విక్రమార్క, కోదండ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, రేవంత్ రెడ్డి ఊరురు తిరిగి చెప్పిండ్రు.. బస్సు యాత్రలు పెట్టి చెప్పిండ్రు.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫార్మా సిటీ రద్దు చేసి తిరిగి రైతులకు భూములు ఇస్తామన్నారు. కానీ మాట మార్చారు. ఫార్మా సిటీ పేరు మార్చి ఫోర్త్ సిటీ అని పెట్టిండు. ఇంకోటి ఫ్యూచర్ సిటీ అట. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగంలో రాష్ట్ర ప్రభుత్వమే పనులు చేస్తదట. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నియోజకవర్గంలో కమిషన్లు, కాంట్రాక్టుల కోసం అలైన్‌మెంట్ మార్చి తమ భూములను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా పని చేస్తున్నాడు.. ముఖ్యమంత్రిలా పని చేయడం లేదు.. మాట్లాడితే మూసీ, హైడ్రా



అంటున్నాడు. చేయాల్సింది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ గబ్బంతా ముఖ్యమంత్రి, మంత్రుల నోట్లనే ఉంది. వాళ్ల నెత్తుల నిండా గబ్బు ఉన్నదని కేటీఆర్ విమర్శించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా పరువు నష్టం దావా వేస్తా.. కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

దిక్కుమాలిన మాటలు, రోతపుట్టించే మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఆయన మంత్రివర్గాన్ని విడిచిపెట్టే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా త్వరలోనే పరువు నష్టం దావా వేస్తానని కేటీఆర్ తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని కందుకూరులో ఏర్పాటు చేసిన రైతు ధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. దిక్కుమాలిన నోటలు, రోత పుట్టించే మాటలు మాట్లాడే ముఖ్యమంత్రిని విడిచిపెట్టం. నీ గబ్బు మాటలకు నీ మంత్రుల చెడ్డ మాటలకు సమాధానం చెబుతాం.ఇక నుంచి వదిలిపెట్టం. నాపై ఆరోపణలు చేసిన మంత్రిపై ఆల్రెడీ పరువు నష్టం దావా వేశాను. ముఖ్యమంత్రి మీద కూడా తొందర్లనే వేస్తా.. అడ్డగోలుగా మాట్లాడిన మంత్రిగారిని విడిపెట్టను.. క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టను. అటు క్రిమినల్, ఇటు సివిల్ డిఫమేషన్ రెండు సూట్లు వేస్తాను.. వదిలిపెట్టే ప్రసక్తే లేదు. తప్పే చేయనుప్పుడు ఎవని అయ్యకు కూడా భయపడం. ఏం చేసుకుంటవో చేస్కో అని మోదీకే చెప్పినం. ఈ చిట్టి నాయుడు ఎంత మనకు.. అడ్డిమారి గుడ్డి దెబ్బలో సీఎం అయిండు. ఇక ఆగుతలేడు. పెద్దోని అయిపోయానని రేవంత్ రెడ్డి అనుకుంటున్నాడు అని కేటీఆర్ మండిపడ్డారు.

సబితక్క ముగ్గురు కొడుకులకు ఫామ్ హౌస్‌లు ఉన్నాయట. మరి అవి ఎక్కడున్నాయో చెబితే మేమే కూలగొడుతాం. సబితక్క బిడ్డకు కూడా ఉందట. అది కూడా చూపిస్తే కూలగొడుతాం. మాట్లాడితే కూలగొడుతా అంటున్నావ్.. అది నీ ఇష్టం. రేవంత్ రెడ్డి నీ కళ్లు చల్లబడుతాయి అనుకుంటే.. మావి కూలగొట్టి అక్కడికి ఆపేయ్. పేదవాళ్లవి మాత్రం కూలగొట్టకు.. వారి ఇండ్లను ముట్టుకోవడం బంద్ చేయ్. ఇవాళ రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే బాధ అనిపిస్తుంది. ఒక దిక్కేమో రైతు గోస.. హైదరాబాద్ పోతే మూసీ బాధితుల రోదన. మూసీ పరివాహక ప్రాంతంలో 50 ఏండ్ల నుంచి ఇల్లు కట్టుకుంటే ఆక్రమణదారులు, కబ్జాదారులు అంటున్నాడు రేవంత్ రెడ్డి. మీ కాంగ్రెస్ ప్రభుత్వమే రిజిస్ట్రేషన్లు చేసే.. ఇన్ని రోజులు పైసలు దొబ్బితింటివి. ఇప్పుడేమో కబ్జాకోరులు అని మాట్లాడుతున్నావు. నీకు చిత్తశుద్ధి ఉంటే.. కొడంగల్‌లోని రెడ్డి కుంటలో నీ సొంత ఇల్లు ఉంది.. దమ్ముంటే దాన్ని కూలగొట్టి.. పేదోళ్ల వద్దకు రా అని సవాల్ చేస్తున్నా. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న మీ అన్న తిరుపతి రెడ్డి ఇల్లు కూలగొట్టు. అప్పటికీ కడుపు మంట చల్లారకంటే మావి కూలగొట్టు.. కానీ పేదల ఇండ్ల వద్దకు రావొద్దని కేటీఆర్ చెప్పారు. నీకు పైసలు, కమిషన్లు కావాలి. రాహుల్ గాంధీకి పంపాలి.. కుర్చీ కాపాడుకోవాలి. నీ బాధ అర్థమవుతుంది. నీకు అంత పైసల పిచ్చి ఉంటే.. నాలుగు కోట్ల మందిమి చందాలు వేసుకునే నీ ముఖాన కొడుతాం. కానీ పేదల ఇండ్లు కూలగొట్టకు.. చందా పైసలను తీసుకెళ్లి ఢిల్లీకి కప్పం కట్టి.. ముఖ్యమంత్రి పదవి కాపాడుకో అని కేటీఆర్ సూచించారు.

# నాలుగు కార్పొరేషన్లుగా హైదరాబాద్

**హైదరాబాద్** : హైదరాబాద్ నగర జనాభా కోటిన్నరకు చేరుతోంది. ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్నజనాభా మొత్తాన్ని పరగిణనలోకి తీసుకుంటే.. కోటిన్నర వరకూ ఉంటారు. ప్రభుత్వం ఇప్పుడు ఔటర్ మొత్తాన్ని గ్రేటర్ పరిదిలోకి తేవాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఇప్పటికే గ్రామాలుగా ఉన్న వాటిని సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. ఇప్పుడు ఆ మున్సిపాలిటీలను కూడా కార్పొరేషన్లుగా మార్చే ప్రణాళికలో ఉన్నారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలో 30 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వీటన్నింటినీ కలిపి, హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్‌గా చేయాలని ప్రభుత్వం మొదట ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. అయితే అది పరిపాలనా పరంగా సరైన నిర్ణయం అనిపించు కోదన్న అభిప్రాయానికి వచ్చారు. అయితే అదే సమయంలో ఇలా లెక్కకు మిక్కిలి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఉంచడం కన్నా.. నాలుగు భాగాలు చేసి, ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ నగరాలుగా నాలుగు కార్పొరేషన్లుగా మారిస్తే మంచిదన్న ఆలోచనకు వచ్చారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నింటినీ కలిపి ఒకే కార్పొరేషన్‌గా చేయడమా? లేక నాలుగు యూనిట్లుగా నాలుగు కార్పొరేషన్లు చేయడమా? అన్న అంశంపై మేథోమథనం చేశారు. చివరికి నాలుగు కార్పొరేషన్లు బెటర్ అనే నిర్ణయానికి వచ్చారు. ఈ విషయాన్ని మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు.పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన తర్వాత స్పెషలాఫీసర్ల పాలన తెచ్చారు రేవంత్ రెడ్డి. కానీ మున్సిపల్ కార్యవర్గాల పదవీ కాలం పూర్తి కాలేదు. ఇప్పుడున్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీ పాలకవర్గాల పదవీ కాలాలు మరో ఏడాది పైనే ఉన్నాయి. అందుకే ఆ పదవీ కాలంపూర్తయిన వెంటనే వాటికి స్పెషలాఫీసర్లను నియమించడం, అన్నింటి పదవీకాలం ముగిసిన తర్వాత



విలీన ప్రక్రియను ప్రారంభించాలని మున్సిపల్ శాఖ అధికారులకు ఇప్పటికే సంకేతాలు వెళ్లాయి. న్యాయపరమైన ఇబ్బందులేవీ రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కూడా సూచించారు. నగరం చుట్టుపక్కన .. ఔటర్ లోపల ఉన్న మున్సిపాలిటీలు కార్పొరేషన్లను తెలంగాణ ఏర్పడిన తర్వాతనే ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పడ్డ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు నిధుల పంపిణీలో అసమానతలు ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. కొన్ని డివిజన్లలో లక్ష మందికిపైగా జనాభా ఉండగా.. కొన్నింటిలో 30 వేల మంది మాత్రమే ఉన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్ నగర్, బండ్లగూడ జాగీర్, నిజాంపేట, బడంగ్ పేట్, మీర్ పేట్ కార్పొరేషన్లు ఉన్నాయి. పేరుకే కార్పొరేషన్లు కానీ మున్సిపాలిటీ స్థాయిలో కూడా పనులు చేపట్టలేకపోతున్నారు. గ్రేటర్ సిటీ మొత్తాన్ని నాలుగు కార్పొరేషన్లుగా చేస్తే మౌలిక వసతుల కల్పనకు కేటాయించే నిధులు, గ్రాంట్లను ఒకే తీరుగా కేటాయించే అవకాశాలు ఉంటాయని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. సిటీ విస్తరణకు అనుగుణంగా శివారు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, వసతుల కల్పనకు కూడా ఈ నిర్ణయం ఉయోగపడుతోందని అనుకుంటున్నారు. గ్రేటర్ పరిధిలో పెద్దగా బలం లేని కాంగ్రెస్ పార్టీకి ఈ నిర్ణయం రాజకీయంగా కూడా లాభం చేస్తుందని నమ్ముతున్నారు.

## హైడ్రా ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

-మొదటిపేజీ తరువాయి

99 ద్వారా హైడ్రాను ఏర్పాటు చేయగా.. అప్పటి నుంచి హైడ్రా దూసుకెళ్లింది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న అనేక అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చి వేసింది. అయితే ఈ కూల్చివేతలపై పలు చోట్ల తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించగా.. హైడ్రా చట్టబద్ధతపై కోర్టు కూడా ప్రశ్నించింది. జీవో 99పై స్టే ఇవ్వాలంటూ అనేక మంది హైకోర్టులో పిటిషన్‌లు వేశారు. ఈ క్రమంలో హైడ్రాకు ఎదురవుతున్న ఆటంకాలు తొలగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ రూపకల్పన చేసింది. జీహెచ్ఎంసీ చట్టం 1955లో 374 బీ సెక్షన్ చేరుస్తూ ఆర్డినెన్స్ జారీ చేశారు. ఓఆర్ఆర్ పరిధి వరకు ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, నాలాలు పరిరక్షిస్తూ సర్వాధికారాలు ఇచ్చేలా చట్టం రూపొందించారు. జిల్లా కలెక్టర్, ఎమ్మార్వో అధికారాలను హైడ్రాకు బదలాయించారు. ఈ ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలపడంతో ఫైల్‌ను రాజ్‌భవన్‌కు పంపింది. ఈ ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం తెలిపారు. గవర్నర్ వ్యక్తం చేసిన పలు సందేహాలకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఇప్పటికే వివరణ ఇచ్చారు. ప్రభుత్వ వివరణలతో సంతృప్తి చెందిన గవర్నర్ హైడ్రా ఆర్డినెన్స్ ఫైల్‌పై సంతకం చేశారు. ఆపై గెజిట్‌ను విడదల చేశారు. గెజిట్ విడుదలతో హైడ్రాకు ఎదురులేకుండాపోయింది. ఇక చట్టబద్ధత లభించడంతో హైడ్రా మరింత వేగంగా దూసుకుపోనుంది. చెరువులు, నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాల విషయంలో తగ్గేదే లే అన్నట్లు చెలరేగిపోనుంది హైడ్రా.

## ప్రాణాలు తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్..

-మొదటిపేజీ తరువాయి

చివరికి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తాము ఇబ్బందులు పడటమే కాకుండా కుటుంబం మ్నొత్తాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారు. ఇలాంటి వారిలో విద్యార్థులే ఎక్కువగా ఉంటున్నారు. శ్రేయోభిలాషులు, పోలీసులు ఎంత హెచ్చరించినా బెట్టింగ్‌కు బానిసైన వారు వినే పరిస్థితిలో ఉండడం లేదు. అప్పుల ఊబిలో కూరుకుపోయి కుటుంబాలను రోడ్డు మీదకు తెస్తున్నారు. చివరికి ఆస్తులు అమ్మినా సరిపోనంతగా అప్పులు పేరుకుపోయి.. చివరికి కుటుంబం మ్నొత్తం ఆత్మహత్య చేసుకుంటున్న ఘటనలు ఇటీవల పెరిగిపోయాయి. తాజాగా అలాంటి ఘటనే ఒకటి నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన సురేశ్, హేమలత దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి హరీశ్ అనే ఒక్కగానొక్క కుమారుడు ఉన్నాడు. అతణ్ని మంచిగా చదివించి ప్రయోజకుడిని చేయాలని తల్లిదండ్రులు భావించారు. అందుకు అనుగుణంగానే హరీశ్‌ను చదివించేందుకు రాత్రింబవళ్లు వ్యవసాయం చేస్తూ కష్టపడుతున్నారు. అయితే కుమారుడు మాత్రం వారి ఆశలపై నీళ్లు చల్లాడు. ఎప్పుడూ ఫోన్ చూసుకుంటూ ఉండేవాడు. ఎంత మందలించినా వినిపించుకునేవాడు కాదు. దీంతో చేసేదేమీ లేక వారు చెప్పడం మానేశారు. అయితే అలా చేయడమే కుటుంబం మ్నొత్తం ప్రాణాలు పోవడానికి కారణం అవుతుందని ఆ రోజు వారు ఊహించి ఉండరు. ఎప్పుడూ ఫోన్ చూస్తుండే హరీశ్ సులభంగా డబ్బులు సంపాదిద్దామని అనుకున్నాడు. పైగా ఎప్పుడూ ఆన్ లైన్ బెట్టింగ్ యాప్‌లు సోషల్ మీడియాలో కనిపిస్తుండడంతో వాటికి బాగా ఆకర్షితుడయ్యాడు. అనుకున్నదే తడవుగా బెట్టింగులు పెట్టడం మ్నొదలుపెట్టాడు. అదే క్రమంలో దానికి బానిసగా మారిపోయాడు. దాన్ని ఆడకుండా ఉండలేకపోయాడు. అలా వందలు, వేలు, లక్షల్లో పెట్టి అప్పుల పాలయ్యాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కుమారుడు హరీశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంత మేర అప్పు చేశావంటూ ప్రశ్నించగా రూ.30లక్షలు అంటూ షాక్ ఇచ్చాడు. దీంతో వారు గుండెలు పగిలేలా రోదించారు. అంత అప్పు ఎలా తీర్చాలంటూ తీవ్ర కలత చెందారు. అప్పులు తీర్చేందుకు ఉన్న కాస్త పొలాన్ని అమ్మేశారు. అయినా అవి తీరలేదు. వాటిని తీర్చే మార్గమూ వారికి కనిపించలేదు. మరోవైపు అప్పులు ఇచ్చిన వారి నుంచి వేధింపులు పెరిగిపోయాయి. దీంతో చేసేదేమీ లేక అందరూ కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ముగ్గురూ కలిసి ఇంట్లోనే ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. దీంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. రోజూ తమతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడిన ఆ దంపతులు.. కుమారుడు చేసిన పనికి ప్రాణాలు తీసుకున్నారని కన్నీటిపర్యంతం అయ్యారు. ఇలాంటి కుమారుడు ఎవరికీ ఉండొద్దని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువతీయువకులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఈజీ మనీ కోసం పాకులాడవద్దని, ముఖ్యంగా ఆన్ లైన్ బెట్టింగుల జోలికి మాత్రం వెళ్లవద్దంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

## ఏడు పథకాలకు ఒకటే కార్డు




-మొదటిపేజీ తరువాయి

సభ్యుల వివరాలు ఉంటాయి. ఒక్కొక్కరికి ఒక్కొక్క యునిక్ నెంబర్ ఉంటుంది. అన్నీ కలిపి చూపించేలా ఓ క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ ఫ్యామిలీకి వస్తున్న పథకాలు, ఏ పథకానికి అర్హులో, రేషన్ కార్డు ఉందా లేదా అనే వివరాలు ఇట్టే తెలిసిపోతాయి. కార్డు రూపకల్పనతోపాటు, లోటు పాట్లు తెలుసుకునేందుకు తెలంగాణ అధికారులు వివిధ రాష్ట్రాల్లో పర్యటించారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ నేతృత్వంలో అధికారుల బృందం ఈ పరిశీలన చేసింది. హర్యానా, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటకలో ఈ టీం పర్యటించింది. అక్కడ అమలులో ఉన్న డిజిటల్ కార్డు విధానాన్ని గమనించింది. లోటుపాట్లు తెలుసుకుంది. ఇక్కడ అమలు చేయాల్సిన విధానం గురించి అంచనాకు వచ్చింది. దీనిపై సీఎంకు ఓ నివేదిక కూడా సమర్పించింది. వన్ ఫ్యామిలీ వన్ డిజిటల్ కార్డు విధానంపై గత పది పదిహేను రోజులుగా సీఎం సమిక్షలు నిర్వహిస్తున్నారు. కార్డు రూపకల్పనపై కసరత్తు చేస్తున్నారు. కార్డు ఎలా ఉండాలి. ఏ ఏ అంశాలు కార్డులో ఉంచాలి. సర్వే చేపట్టే విధానం ఇలా అన్నింటిపై అధికారులతో దఫదఫాలుగా చర్చలు జరిపారు. మొత్తానికి కార్డు రూపకల్పన ఓ కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. రేషన్ కార్డు, మహాలక్ష్మి పథకాల లబ్ధిదారులను ప్రస్తుతానికి తొలి దశలో డిజిటలైజేషన్ చేయాలని చూస్తున్నారు. డిజిటల్ కార్డుల్లో రేషన్ కార్డుల దారుల వివరాలు, మహాలక్ష్మి పథకాల లబ్ధిదారుల వివరాలు, పొందుపరుస్తారు. తర్వాత ఆరోగ్య శ్రీ, గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ లబ్ధిదారుల పేర్లు చేరుస్తారు. అనంతరం పింఛన్ దారుల వివరాలు పొందుపరుస్తారు. ఇలా ఒక్కొక్క దశలో ఒక్కో పథకం లబ్ధిదారులు చేరుస్తూ వెళ్తారు. ఒకేసారి అందరి వివరాలు చేర్చడం ఇబ్బంది అవుతుందని అధికారులు భావిస్తున్నారు. దీని వల్ల తప్పులు జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అందుకే విడతల వారీగా వివరాలు నమోదు చేస్తే సమస్య ఉండదని చిన్న చిన్న మార్పులు ఉంటే చేసుకోవచ్చని అంటున్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవాల్సి ఉన్నా, పథకాల లబ్ధిదారులు చేరినా వారి పేర్లు తర్వాత చేర్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్డులు లబ్ధిదారుల చేతికి వస్తే పదే పదే ఆధార్, ఇతర ధ్రువపత్రాలు అధికారులకు ఇవ్వాల్సిన పనిలేదు. అవసరమైనప్పుడు ఇందులో ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ ఫ్యామిలీ వివరాలు పూర్తిగా తెలిసిపోతాయి. దీని వల్ల వాళ్లకు ఇవ్వాల్సిన పథకాలు, అర్హత వివరాలు అన్నీ అందులో డిస్‌ప్లే అవుతాయి. ఇప్పుడు ఉచిత బస్ అమలు అవుతున్నందున ఆధార్, ఇతర కార్డులతో పని లేకుండా ఈ డిజిటల్ కార్డు చూపిస్తే సరిపోతుంది. దాన్ని స్కాన్ చేసిన తర్వాత వాళ్లు అర్హులా కాదా అనేది తేలిపోతుంది. ఈ డిజిటల్ కార్డుకు సంబంధించి కుటుంబాల వివరాలు నమోదు చేసే పైలెట్ ప్రాజెక్టు మూడో తేదీ నుంచి కొనసాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీన్ని సికింద్రాబాద్‌లో ప్రారంభించారు. ప్రతి నియోజకవర్గంలో రెండు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఒక వార్డులో అధికారులు తిరుగుతున్నారు. ప్రజలతో మాట్లాడి వారి ఫ్యామిలీ వివరాలు సేకరిస్తున్నారు. ఆ పైలెట్ ప్రాజెక్టు ఏడో తేదీతో గడువు ముగియనుంది. అనంతరం పూర్తిస్థాయి సర్వే ఎప్పటి నుంచి వంటి వివరాలు అధికారులు తెలియజేయనున్నారు.

# కొండా సురేఖకు కేటీఆర్ వార్నింగ్





**హైదరాబాద్ :** మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖపై తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు.'రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి , మంత్రులు నాపై ఇష్టం వచ్చినట్లు గబ్బు మాటలు మాట్లాడుతున్నారు. నాపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖపై కోర్టులో పరువు నష్టం దావా వేశాను. అదేవిధంగా రేపోమాపో సీఎం రేవంత్ రెడ్డిపై కూడా పరువు నష్టం దావా వేస్తాను. తప్పు చేయనప్పుడు మేము ఎందుకు భయపడాలి. ప్రధాని మోదీ లాంటి వ్యక్తికే భయపడలేదు.. రేవంత్ రెడ్డి ఎంత' అంటూ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు.ఇదిలా ఉంటే.. గత మూడు నాలుగు రోజులుగా రాష్ట్రంలో సోషల్ మీడియా ట్రోలింగ్ రాజకీయం కొనసాగుతున్న విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో ట్రోలింగ్ విషయమై బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రాజకీయ వార్ కొనసాగుతోంది. తనపై బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టులు పెట్టి వాటిని ట్రోలింగ్ చేస్తున్నారంటూ మంత్రి కొండా సురేఖ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తాను మనోవేదనకు గురైనట్లు మంత్రి కంటతడి పెట్టారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీకి, కేటీఆర్, కేసీఆర్ ను ఆమె హెచ్చరించారు. మీ ఇష్టానుసారంగా పోస్టులు పెడితే జాగ్రత్త.. ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఖచ్చితంగా తగిన గుణపాఠం తప్పదన్నారు. ఆ పోస్టులను మీ ఇంట్లో ఉన్న మహిళలకు చూపించండి? అప్పుడు వాళ్లు ఏం సమాధానం చెబుతారో చూడండి అంటూ కేటీఆర్ పై ఆమె ఫైరయ్యారు.ఆ తరువాత కొండా సురేఖ వ్యాఖ్యలపై కేటీఆర్ రియాక్ట్ అయ్యారు. మంత్రి గారివి దొంగ ఏడుపులు, పెడ బొబ్బలన్నారు. తమపై వ్యాఖ్యలు చేసేముందు కొండా సురేఖ ఒకసారి ఆమె గతాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. ఇష్టానుసారంగా గతంలో తమపై వ్యాఖ్యలు చేయలేదా అంటూ ప్రశ్నించారు. ఆ సమయంలో తాము బాధపడ్డామన్నారు. తమ ఇంట్లో ఉన్న మహిళలు కూడా బాధపడరా? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. సీఎం, మంత్రులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. వారి నోళ్లను ఫినాయిల్ తో కడగాలంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.కాగా, కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ మరోసారి ఫైరయ్యారు. కేటీఆర్ తీరు మారడంలేదన్నారు. ఓ హీరోయిన్ పేరు ఎత్తుతూ.. సదరు హీరోయిన్ తన భర్త నుంచి విడాకులు తీసుకోవడానికి కేటీఆరే కారణమంటూ ఆమె ఆరోపించారు. ఈ క్రమంలో మంత్రి కొండా సురేఖపై సినిమా ప్రముఖులు ఫైరయ్యారు. చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్, డైరెక్టర్ ఆర్జీవీతోపాటు సినిమా పెద్దలు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మంత్రి కొండా సురేఖ సదరు హీరోయిన్ కు క్షమాపణలు చెప్పారు. కేటీఆర్ పై ఆగ్రహంతో మాట్లాడానే తప్ప మరోటి కాదంటూ వ్యాఖ్యానించారు. ఆ తరువాత కూడా మంత్రి కొండా సురేఖ.. కేటీఆర్ పై పలు వ్యాఖ్యలు చేశారు. గజ్వేల్ లో పర్యటించిన ఆమె కేసీఆర్ కనబడటంలేదంటూ ఆరోపణలు చేశారు. కేటీఆరే ఆయనను ఏమైనా చేసి ఉండొచ్చని, ఇందుకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామంటూ మంత్రి పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి

**జయశంకర్ భూపాలపల్లి :** ధాన్యం దిగుబడి అంచనా మేరకు కొనుగోళ్లకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో వ్యవసాయ, పౌర సరఫరాలు, మార్కెటింగ్, సహకార పరిశ్రమలు, డిఆర్డీఏ శాఖల అధికారులతో దాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు, కొనుగోలు కేంద్రాలల్లో సౌకర్యాలు కల్పన, కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలకు శిక్షణా తరగతులు నిర్వహణ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 105650 ఎకరాల్లో వరి సాగు జరిగిందని దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దాన్యం వచ్చే అవకాశం ఉందని అంచనా మేరకు 300 కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వరి కోతలు ప్రారంభాన్ని బట్టి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏడాది వానాకాలం సీజన్ లో రైతులు సాగు చేసిన వరి ధాన్యం చేతికి రావడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ కొనుగోళ్లపై అధికారులు సన్నదంగా ఉండాలని తెలిపారు. ఇందుకోసం అవసర మైన గన్నీసంచులు, ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు టార్పా లిన్లు, తేమ నిర్ధారణ యంత్రాలకు ప్రతిపాదనలు పంపాలని మార్కెటింగ్ డిఎం ను ఆదేశించారు. గత సంవత్సరం ఏ ఏ కేంద్రాల్లో దాన్యం ఎక్కువగా వచ్చిందో అంచనా ప్రకారం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఇంచార్జి లకు ముందుగానే శిక్షణా తరగతులు నిర్వహణకు షెడ్యూల్ తయారు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో టెంట్లు, తాగునీరు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వం సన్న ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించినందున సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు విడివిడిగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రత్యేకంగా నంబర్లు వేయాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల సంస్థ డిఎం రాములు, జిల్లా వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, సహకార అధికారి వాలియా నాయక్, మార్కెటింగ్ డిఎం కనక శేఖర్, పరిశ్రమల శాఖ జిఎం సిద్దార్థ రెడ్డి, డిఆర్డిఎ డిపిఎం రవి, ఈడీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కాకర్లపల్లి జీపి కి వీధిలైట్లు,ఎలక్ట్రికల్ సామాగ్రిని అందజేసిన మెండే రాజయ్య

**గ్రామానికి తన వంతుగా చేయూత**

**మెండే రాజయ్యను ఆదర్శంగా తీసుకొని గ్రామ సేవకు దాతలు ముందుకు రావాలి**



**మంథని :** బతుకమ్మ,దసరా ఉత్సవల్లో భాగంగా గ్రామానికి తన వంతుగా ఏదైనా చేయాలనే తపనతో గ్రామంలో చీకటిని పారదోలెందుకు గ్రామపంచాయతీకి దాదాపు రూ.20 వేల విలువ చేసే వీధిలైట్లు,ఎలక్ట్రికల్ సామాగ్రిని బహుమతిగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు మెండే రాజయ్య అందించారు. శనివారం మంథని మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన మెండే రాజయ్య తన సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన వీధిలైట్లు, ఎలక్ట్రికల్ సామాగ్రిని పంచాయతీ కార్యదర్శి జోత్స్నరాణి , సిబ్బందికి గ్రామ ప్రజల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా మెండే రాజయ్య మాట్లాడుతూ రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు గ్రామపంచాయతీకి ఈ సామాగ్రిని అందజేశామన్నారు. బతుకమ్మ,దసరా ఉత్సవాల్లో వీధి లైట్లు ఇతర పనులకు ఖర్చు చేయడానికి గ్రామపంచాయతిలో సరిపడు నిధులు లేవని మా ద్రుష్టి కి వచ్చిందని,దింతో కాంగ్రెస్ నాయకులందరం సమిష్టిగా కలిసి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలకు అతి పెద్ద పండగ అయిన దసరా, బతుకమ్మ ఉత్సవలల్లో భాగంగా గ్రామంలో బతుకమ్మ ఊరేగింపుగా చెరువు వద్దకు తీసుకవెళ్లి బతుకమ్మను చెరువులో వేయడం జరుగుతుంది కాబట్టి దీనీలో భాగంగా ఉరి నుండి చెరువు గట్టు వరకు చీకటి ఉన్నందున నేను ముందుకు వచ్చి గ్రామపంచాయతీకి వీధి లైట్లను ఎలక్ట్రికల్ సామాగ్రిని అందజేశానని తెలిపారు.గత బిఆరెస్ కాలంలో గ్రామంలో ప్రజలను గ్రామాన్ని గ్రామపంచాయతీ లో ఉన్న నిధులను చూస్తేనే పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్టుగా తెలుస్తోందన్నారు. ఎంత మేరకు అవినీతి జరిగిందో కూడా అర్ధం అవుతుందని,ఇంకా గ్రామపంచాయతి సంబందించి లక్షల అప్పులు కూడా ఉన్నట్టు మాకు సమాచారం అందిందన్నారు.ఊర్లో మాత్రమే తూతూ మాత్రంగా పనులు చేసి బిల్లులు కజేసినట్టుగా చూస్తేనే అర్ధం అవుతుందని ఇలాంటి పరిస్థితి భవిష్యత్తులో జరగకుండా మంత్రిదుద్దిళ్ల శ్రీధర్ బాబు సహాకరంతొ వారి హయాంలో గ్రామాన్ని అభివృద్ధిలో అన్ని హంగులాలతో ముందుకు తీసుకవెళ్తామన్నారు. గ్రామానికి ప్రజలకు ఎల్లవేళలా నా వంతుగా సేవ చేస్తూనే ఉంటానని ఆయన తెలిపారు.మెండే రాజయ్యను ఆదర్శంగా తీసుకొని గ్రామ సేవకు దాతలు ముందుకు రావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కనవేన ఓదెలు, సీనియర్ నాయకులు తన్నీరు లక్ష్మణ్,కనవేన కుమారస్వామి, భాస్కర్ల శంకరయ్య, ఆకుల మధుకర్, ఈసంపల్లి మహేందర్, ఎలగందుల రవి, ఇసంపల్లి మధుకర్,మాదరబోయిన కిషన్, యూత్ నాయకులు ఎలగందుల వెంకటేష్, ఎలకుర్తి మహేష్, గుంటకు గణేష్,లక్కం రమేష్ తోట శ్రీధర్ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పూలనే పూజించి దేవతలా చూసుకునే గొప్ప పండుగ బతుకమ్మ

**జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**



**జగిత్యాల :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు, ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు. శనివారం రోజున కలెక్టరేట్ సముదాయంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు వారి వారి శాఖల ద్వారా బతుకమ్మను తీరొక్క పూలతో తయారు చేసి మధ్యలో పెట్టి కోలాటాలు ఉయ్యాల పాటలు డీజే పాటల నడుమ బతుకమ్మ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయన సతిమణితో కలిసి ఉద్యోగులతో బతుకమ్మ ఆడి పాడి వేడుకలలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మన పండగ మన సంస్కృతి మన సాంప్రదాయానికి ప్రతీక ఆడపడుచుల ఔన్నత్యానికి సూచిక అన్నారు. తొమ్మిది రోజులపాటు అడబిడ్డలు అందరూ కలిసి తీరొక్క పూలు, తీరొక్క రంగులతో ఆడుకునే గొప్ప పండగ బతుకమ్మ అని అన్నారు. మహిళలు ఎంతో ఇష్టంతో పూలను పేర్చి గౌరమ్మను తీర్చి కోరిన కోరికలు ఫలించాలనే నమ్మకంతో ఈ బతుకమ్మ పండుగ జరుపుతారని, దేశంలో పూలను పూజించి ప్రకృతి ని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని ఇలాంటి సంస్కృతి మన తెలంగాణలోనే ఉందని, బతుకమ్మ పండుగను అధికారికంగా రాష్ట్ర పండుగగా గుర్తించారని అన్నారు. ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని, బతుకమ్మ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. రాంబాబు, గౌతమ్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరేష్, జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్, వివిధ జిల్లా శాఖ అధికారులు, మహిళా ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పోటీ పడి పెరుగుతున్న టామాటా, ఉల్లి

**హైదరాబాద్ :** టమాటా ధరలు ఒక్కసారిగా సెంచరీ కొట్టేస్తోంది. ఎక్కడ చూసీన 80 రూపాయ కంటే తక్కువకు కిలో టమాటా దొరకడం లేదు. నిన్న మొన్నటి వరకు 50రూపాయల్లోపు ధర పలికే టమాటా ఇప్పుడు ఒక్కసారిగా డబుల్ అయిపోయింది. కొనేందుకు వెళ్తున్న వినియోగదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఉన్న వాటినోత సరిపెట్టుకుంటున్నారు. అసలే పండగ సీజన్ ఆపై ధర పెరిగిపోవడంతో ఏం తినాలని వాపోతున్నారు. టమాటా లేనిదే దాదాపు ఎవరింట్లో కూడా వంట పూర్తి కాదు. వెజ్ ఆర్ నాన్‌వెజ్ ఏం వండినా టమాటా ఉంటే ఆ వంటకానికి అదనపు రుచి వస్తుంది. కుటుంబానికి సరిపడేలా వంటకం పూర్తి అవుతుంది.ఇప్పుడు టమాటో వందకు చేరుకోవడంతో వినియోగదారులు ప్రత్యామ్నాయాలు చూసుకుంటున్నారు. కొందరు చింతపండును వినియోగిస్తుంటే మరికొందరు నిమ్మకాయలతో సరిపెట్టుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో వాతావరణ పరిస్థితులకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో పంటలు బాగా దెబ్బతిన్నాయి. అక్కడ పండించే పంట పూర్తిగా నాశనమైపోయింది. అక్కడి దిగుబడి పూర్తిగా పడిపోయింది. మధనపల్లిలో పరిస్థితి అంతే ఉంది. ఈ మూడు ప్రాంతాల నుంచి వచ్చే టమాటా ఒక్కసారిగా తగ్గిపోవడంతో పరిస్థితి మారిపోయింది. మొన్నటి వరకు యాభైరూపాయల వరకు ఉండే టమాటా ధరలు ఇప్పుడు ఏకంగా వంద రూపాయలకు చేరాయి. ఇప్పట్లో ఈ ధరలు తగ్గే అవకాశం లేదని తెలుస్తోంది. మదనపల్లె మార్కెట్‌లోనే టమాటా ధర 80 రూపాయలకుపైగా పలుకుతోంది. అంటే మిగతా ప్రాంతాలకు ఆ సరకు వెళ్లే సరికి వంద రూపాయలకు పైమాటే అంటున్నారు. ఉల్లిగడ్డల ధరలు కూడా ఆ స్థాయిలోనే కనిపిస్తున్నాయి. మహారాష్ట్ర నుంచి సరిపడా సరకు రాకపోవడంతో ఉల్లి రేటు పెరిగిపోతోంది. అది కూడా క్వాలిటీ ఉండటం లేదన్నది వినియోగదారులు చెబుతున్న మాట.

## డిజిటల్ సర్వేను పరిశీలించిన ఉన్నతాధికారులు



**గజ్వేల్ :** గజ్వేల్ పట్టణంలోని ఫ్యామిలీ డిజిల్ కార్డ్ అధికారులు నిర్వహిస్తున్న కుటుంబ వివరాల నమోదు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరితొ కలిసి సిఎంఓ జాయింట్ సెక్రటరి సంగీత సత్యనారాయణ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.సిఎంఓ జాయింట్ సెక్రటరి మాట్లాడుతు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ ఇంప్లిమెంటేషన్ చేయడానికి అర్బన్, రూరల్ లో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన కుటుంబ వివరాలను అత్యంత పారదర్శకంగా ఏ ఓక్క ఇంటిని కూడా మరిచిపోకుండా సర్వే జరపాలని సూచించారు. ఈ వివరాల కోసం కుటుంబాలకు వెళ్ళినప్పుడు కుటుంబంలోని అందరి వివరాలు కరెక్ట్ గా ఉన్నాయో చుసుకుని ఒకవేళ కుటుంబంలో సభ్యులను చేర్చడం కానీ తీసివేయడం కాని జరిగితే వారి వివరాలను సపరేటు రాయడం తో పాటు మహిళను కుటుంబ పెద్దగా డిజిటల్ కార్డు మంజూరు చెయ్యడం జరుగుతుంది. ఈ మొత్తం సర్వే అక్టోబర్ 3వ తేదీ నుండి 8వ తేదీ వరకు 5 వర్కింగ్ డేస్ లలో నిర్వహిస్తున్నట్లు ఇప్పటివరకు జిల్లాలో దాదాపు 80 శాతంపైగా సర్వే పూర్తయినట్టు మిగతాది త్వరగా పూర్తిచేసి సర్వే రిపోర్ట్ ను పై స్థాయిలోకి పంపిస్తామని తెలియజేశారు. వీరి వెంట ఆర్డిఓ బన్సీలాల్, మున్సిపల్ కమిషనర్, తాసిల్దార్లు, సర్వే సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## దేశంలోనే సీనియర్ రాజకీయ నేతల్లో ఒకరిగా నిలిచిన కాకా

**-మంథనిలో ఘనంగా గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు**

**-ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు**



**మంథని :** దేశంలోనే సీనియర్ రాజకీయ నేతల్లో గడ్డం వెంకటస్వామి (కాకా) ఒకరని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్, పట్టణ అధ్యక్షులు పోలు శివ ఆధ్వర్యంలో మంథని పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కేంద్ర మాజీ మంత్రి, పెద్దపల్లి మాజీ పార్లమెంట్ సభ్యుడు స్వర్గీయ గడ్డం వెంకటస్వామి (కాక) జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.కాక చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మండల పార్టీ అధ్యక్షులు ఆయిలి ప్రసాద్, ప్రచార కమిటీ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలకల ప్రవీణ్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజీమ్ ఖాన్ లు మాట్లాడుతూ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాద రావు వెంకటస్వామి అనుబంధం ఎనలేనిదని, ఎన్నో పోరాటాలు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యున్నత స్థానంలో వారి యొక్క సేవలను అందించారనీ అన్నారు. ఆ కాలంలో ఎఫ్సిఐ, సింగరేణి కంపెనీలు నష్టాల్లో కూరుకుపోతున్న సమయంలో కేంద్రంతో మాట్లాడి సంస్థలను కాపాడిన ఘనత కాక వెంకట స్వామి దన్నారు.20 ఏండ్లు నిండకుండానే ఉద్యమం సాగించారనీ నిజాం వ్యతిరేక పోరాటంలో కాకా వెంకటస్వామి జైలుకెళ్ళారు. ఇలాంటి పట్టుదలే తెలంగాణ ఉద్యమం ఆయన్ని తిరుగులేని నేతగా మార్చిందన్నారు.భవన నిర్మాణ కూలీగా, ఉద్యమకారుడిగా మొదలైన కాకా వెంకటస్వామి ప్రస్థానం... పేదలు, కార్మికుల నాయకుడిగా ఆ తరువాత ఎంపీగా, కేంద్ర మంత్రిగా జాతీయ స్థాయికి చేరిందని తెలిపారు. మెట్రిక్ మాత్రమే చదివిన ఆయనకు జీవితం నేర్పిన అనుభవమే అంతర్జాతీయ స్థాయిలో కార్మికుల తరపున ప్రసంగించే స్థాయికి తీసుకెళ్లిందని,స్వాతంత్ర్యోద్యమం నుంచి తెలంగాణ సాధన ఉద్యమం దాకా అన్నింటిలోనూ పాల్గొన్న కాకా దేశంలోనే సీనియర్ రాజకీయ నేతల్లో ఒకరిగా నిలిచారన్నారు.అప్పట్లో హైదరాబాద్ లో బతకడానికి వచ్చిన పేదలు ఖాళీ జాగాల్లో గుడిసెలు వేసుకునేవారని, భూముల విలువ పెరగడంతో భూస్వాములు పేదలను వెళ్లగొట్టడం మొదలుపెట్టారని,గూండాలతో దౌర్జన్యంగా వెళ్లగొడుతున్న తీరును చూసి కదిలిపోయిన వెంకటస్వామి 1949లో దేశంలోనే మొదటిసారిగా జాతీయ గుడిసెల సంఘం పెట్టారన్నారు. కాకా పోరాటంతో హైదరాబాద్ నగరంలోనే దాదాపు 80 వేల మందికి సొంత గూడు దక్కిందని భవన నిర్మాణ కూలీలు, రిక్షా కార్మికుల సమస్యలపైనా కాకా పోరాటం చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముసుకుల సురేందర్ రెడ్డి, గోటికార్ కిషన్ జి, పర్శవేన మోహన్ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

Printed , Publisher , Edited and Owned by Rathod Raju , Printed at Jai Bhavani Printing Press , H.No. 2-42, Village : Jamidi Mdl. Ichoda Dist. Adilabad., State Telangana , Pin code – 504 307 ( T.S.) ,
TITLE CODE : TELTEL02020EDITOR : RATHOD RAJU , Contact Numbers : 9908940762 , 8985614333 . Email : republichindustan.rh@gmail.com , www.republichindustan.in ,